క్లుప్తంగా

10న బ్రాహ్మణ కార్తీక సమారాధన

కోదాడఅర్బన్ : కార్తీక మాసం చివరి ఆదివారం (ఈ నెల 10వ తేదీన) కోదాడ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గంలోని బ్రాహ్మణులకు కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. కోదాడలోని గాయిత్రీ భవన్ (బ్రాహ్మణ సంఘం భవనం) లో ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి కోదాడ నియోజకవర్గ బ్రాహ్మణులందరూ తమ కుటుంబాలతో సహా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

కోదాడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన కార్తీక మాస చివరి ఆదివారం కార్తీక వనసమారాధన (వనభోజనాలు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు గురువారం తెలిపారు. కోదాడలోని రామిరెడ్డి పాలెం రోడ్డులో ఉన్న నాగుబండి రంగా మామిడి తోటలో ఈ కార్యక్రమం ఉంటుందని, ఉదయం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, వ్రతాలు ఉంటాయని ఆర్యవైశ్యులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

జనవరిలో భక్త సమ్మేళనం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో రామకృష్ణ - వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 20, 21వ తేదీల్లో 5వ వార్షిక భక్త సమ్మేళనం నిర్వహించనున్నట్లు స్థానిక రామకృష్ణ సేవా సమితి సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భక్త సమ్మేళనంలో పాల్గొనే వారికి ప్రవేశ రుసుం ఉంటుందని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


హరిశంకర్

కోదాడఅర్బన్ : ఎల్‌ఐసీ కోదాడ బ్రాంచ్ యూనిట్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విష్ణుదాస్యం హరిశంకర్, కార్యదర్శిగా బి.కన్నయ్య, మహిళా కార్యదర్శులుగా బి.కరుణ, ముండ్రా లావణ్య, కోశాధికారిగా ఆర్.శ్రీనివాస్, డివిజనల్ కమిటీ సభ్యుడిగా కెవి ప్రసాద్‌బాబుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సీనియర్ బ్రాంచ్ మేనేజర్ భానుకుమార్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ రాము శాలువాలతో ఘనంగా సత్కరించారు.

యువత మద్యం, నోట్ల కట్టలకు లొంగొద్దు

నడిగూడెం : సర్పంచ్ ఎన్నికల్లో యువత మద్యం, నోట్ల కట్టలకు లొంగవద్దని తెలంగాణ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ నవీన్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఎన్నికల్లో రాజకీయ నాయకులు యువతకు జెండాలు చూపి, మద్యాన్ని ఎర వేసి పెడదోవపట్టేలా చేస్తున్నారని అన్నారు.

12 నుంచి తపాలా ఉద్యోగుల సమ్మె


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నేరేడుచర్ల : ఆలిండియా గ్రామీణ డక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డక్ సేవక్‌ల యూనియన్ల పిలుపు మేరకు ఈనెల 12 నుంచి తపాలా ఉద్యోగులు చేపట్టబోయే సమ్మెను విజయవంతం చేయాలని గ్రామీణ తపాల ఉద్యోగుల డివిజన్ కన్వీనర్ జి.నాగరాజు కోరారు. గురువారం నేరేడుచర్లలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు 8 గంటలు పని విధానం అమలు చేయడంతో పాటు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు అమలు చేయాలని కోరారు. సీనియర్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్ అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీపీఎంలు రామ నర్సయ్య, రమేష్, జ్యోతి, రమేష్, మర్రి చెన్నయ్య, పుల్లయ్య, నారాయణ, అశ్విని, ఉష, సునిత, శివ తదితరులు ఉన్నారు.

ఉత్తమ్ ప్రమాణస్వీకారానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌ను పలువురు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

అర్వపల్లి : తిమ్మాపురం, అర్వపల్లి క్లస్టర్‌ల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వ్యవసాయ విస్తరణ అధికారులు నేరేళ్ల సత్యం, శోభారాణిలు సందర్శించారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కాంటాలు వేయించారు. పచ్చిగా ఉన్న ధాన్యాన్ని ఆరబోసి ఎండబెట్టాలని రైతులకు సూచించారు.

సాగుకు ఎస్సారెస్పీ నీరొచ్చేనా

- మేజర్, మైనర్ కాల్వలు తవ్వి 14 ఏళ్లు
- నాటి నుంచి నాన్‌ఆయకట్టుకు చుక్కనీరు అందని వైనం
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నీరొస్తుందని ఆశగా ఎదురుచూస్తున్న రైతులు


వేణుగోపాలపురం వద్ద నిరుపయోగంగా ఉన్న ఎస్సారెస్పీ మేజర్ కాలువ


చెన్నకేశ్వాపురం వద్ద..

నడిగూడెం : మండలంలోని నాన్ ఆయకట్టు గ్రామాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా 14 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువలు తవ్వింది. కానీ నాటి నుంచి నేటివరకు ఆయా కాల్వల ద్వారా చుక్కనీరు అందించలేదు. మండల పరిధిలోని వేణుగోపాలపురం, బృందావనపురం, చెన్నకేశ్వాపురం, వెంకట్రాంపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం గ్రామాల పరిధిలో ఎస్సారెస్పీ మేజర్, మైనర్ కాల్వలు నిర్మించారు. కానీ నీరు రాకపోవడంతో రైతులు మెట్ట పంటలైన కంది, పెసర, పత్తి, తదితర పంటలు పండిస్తున్నారు. ఇక బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, వెంకట్రాంపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో బోర్లు, బావులు, చెరువుల కింద పంటలను సాగు చేసుకుంటున్నారు.

అధ్వానంగా కాల్వలు..

మండలంలోని నాడు ఏర్పాటు చేసిన ఎస్సారెస్పీ మేజర్, మైనర్ కాల్వలు ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యాయి. పలు చోట్ల కాల్వలు పూడిపోయాయి. పలు గ్రామాల్లో కాల్వలు కంప చెట్లమయంగా మారాయి. అలాగే తూములు కూడా పూడిపోయాయి. గత ప్రభుత్వం ఈ కాల్వలకు చుక్క నీరు కూడా అందించలేదని, కొత్త ప్రభుత్వం అయినా స్పందించి కాల్వలకు మరమ్మతులు చేసి సాగు నీరందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

కాల్వలు తవ్వి వదిలేశారు



మా గ్రామ సమీపాన 14 సంవత్సరాల కిందట శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందించేందుకు కాల్వలు తవ్వారు. నిర్మించిన నాటి చుక్క నీరు కూడా రాలేదు. దీంతో కాల్వలు శిథిలావస్థకు చేరాయి. పలు చోట్ల కాల్వలు కంపచెట్లమయంగా మారాయి.

– షేక్.సైదులు, రైతు, వేణుగోపాలపురం

సాగుకు నీరందించాలి



మా గ్రామ సమీపాన ఎస్సీరెస్పీ కాల్వలు తవ్వారు. మేజర్, మైనర్ కాల్వలు నిర్మించిన నాటి నుంచి నిరుపయోగంగానే ఉంటున్నాయి. కాల్వలు తీయగానే సాగు నీరు వస్తుందని ఆశ పడ్డాం. నేటికీ సాగు నీరు రాలేదు. సంబంధిత అధికారులు స్పందించి సాగు నీరు అందించి మా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలి.

– పాతకొట్ల రవి, కరివిరాల

రామాలయ ముఖద్వార ప్రతిష్ఠాపనోత్సవం


పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

నేరేడుచర్ల : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో దాతల సహకారంతో రెండు కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న శ్రీకోదండ రామాలయంలో ముఖద్వారం (గుమ్మం) ప్రతిష్ఠాపనోత్సవాన్ని గురువారం వేద పండితుల వేద మంత్రోత్సవాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖద్వారం (ద్వాజ)కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, నేరేడుచర్లకు చెందిన రాచకొండ రామచందర్‌రావు సోదరులు, కుటుంబసభ్యులు రామాలయం నిర్మాణానికి 18 కుంటల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, ఆలయ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ తాళ్లూరి సాయి, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పాల్వాయి రమేష్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, పట్టణ ప్రముఖులు పులిజాల వెంకటరమణరావు, చింతకుంట్ల శ్రీను, వేణుగోపాల్‌రెడ్డి, సీతారాంరెడ్డి, సైదయ్య, భరత్, గోపాల్‌రెడ్డి, వెంకన్న, సత్యనారాయణ, సుబ్బారావు, మహేష్, చిన్నయ్య, బట్టు మధు, తదితరులు పాల్గొన్నారు.

నూతన మంత్రులను కలిసిన కోదాడ కాంగ్రెస్ నాయకులు


సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోదాడ రూరల్ : నూతనంగా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కోదాడ కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మంత్రి పదవి రావడంతో రాష్ట్రంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. మంత్రులను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, సీతారాంసింగ్, రాజీవ్ నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి


చింతలపాలెంలో నిరసన తెలుపుతున్న రైతులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరారు. గురువారం చింతలపాలెంలో మండల రైతు జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు మూడు రోజులుగా మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి వందలాది ఎకరాల్లో మిర్చి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. చేతికి వచ్చే సమయంలో పంట నష్టపోయామని, అయినా తమను పలకరించేవారు కాని పట్టించుకునే వారు లేరని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే కనీస నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతు జేఏసీ కమిటీ నాయకులు మోర్తాల నాగిరెడ్డి, ఉసిరికాయల వెంకట్, కందుల రామకృష్ణారెడ్డి, కనితి ప్రశాంత్, ఎస్‌కే షబ్బీర్, సంజీవరెడ్డి, సైదిరెడ్డి, వెంకటరెడ్డి, ఎస్‌కే చిన్న బాబు, శంభులింగం, కాశయ్య, లక్ష్మారెడ్డి, హుస్సేన్, ఇమ్రాన్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నడిగూడెం : మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, క్షేత్ర స్థాయిలో సర్వే చేసి, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం


అన్నారిగూడెంలో నీట మునిగిన మిర్చి తోటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నామవరంలో పత్తి చేనును పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మోతె : తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నామవరం, అన్నారిగూడెం, నర్సింహాపురం, తుమ్మగూడెం, ఉర్లుగొండ, రాఘవాపురం గ్రామాల్లో తుఫాన్‌కు దెబ్బతిన్న వరి ధాన్యం, వరి, పత్తి, మిర్చి పంటలను ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, సీత శ్రీను, మేదరమెట్ల వెంకటనారాయణ, అర్వపల్లి గణేష్, కార్తీక్, నల్లు కరుణాకర్‌రెడ్డి, మాదగాని సత్యం, తుమ్మెలి అశోక్‌రెడ్డి, పిట్ల నాగయ్య, మామిడి వెంకటేశ్వర్లు, బట్టిపెల్లి నాగమల్లు, దుర్గయ్య, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం


కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న దాతలు, నిర్వాహకులు


కోదాడఅర్బన్ : అయ్యప్ప దేవాలయంలో..

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో గురువారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులను అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. అన్నదానానికి మునగాలకు చెందిన సాల్లేటి శివ -రమ్య దంపతులు, కోదాడకు చెందిన మణిస్వామి సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు తంగెళ్ల సాంబ, బొబ్బిలి సంజీవరెడ్డి, కొమ్ము ఈదారావు, గాయం శ్రీనివాసరెడ్డి, అక్కినేపల్లి శ్రీనివాస్, జల్లా రాంబాబు, జిల్లా పెద్ద వీరస్వామి పాల్గొన్నారు.

కోదాడలో..

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు గురువారం దాతలు ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మల్లం రమేష్‌గౌడ్-కల్పన దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 500 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు ప్రజ్ఞశ్రీ, హరీష్వా, నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, బర్మావత్ సీతారాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, పవన్, రంగా, నాగరాజు తదితరులు ఉన్నారు.

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న శ్రీ అయ్యప్ప దేవాలయంలో గురువారం సుమారు 500 మంది అయ్యప్ప స్వాములకు దాతల సహకారంతో అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా దాతలు గన్నవరపు రాజశేఖర్, శారద, సూర్యవంశీ, శివదత్తు, కాకర్ల నర్సింహారావు, పుష్పలత, ఉదయలక్ష్మి, మానసలను సత్కరించినట్లు పేర్కొన్నారు. మకర జ్యోతి ఆలయంలో వరకు అన్నదానం కొనసాగించనున్నట్లు తెలిపారు.

మంత్రివర్గంలో ముదిరాజ్‌లకు స్థానం కల్పించాలి

అర్వపల్లి : రాష్ట్ర మంత్రి వర్గంలో ముదిరాజ్‌లకు స్థానం కల్పించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరి గెలుపొందారని చెప్పారు. బీసీ కులాల్లో ముదిరాజ్ సామాజికవర్గం పెద్దదని.. ఈ సామాజిక వర్గం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు కృష్ణ, వెంకన్న, అర్వపల్లి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు


మేళ్లచెరువులో దెబ్బతిన్న పత్తి చేను


రేవూరు పరిధిలో నేలవాలిన మొక్కజొన్న పంట


రేవూరులో వరి చేనులో నీటిని తొలగిస్తున్న రైతు


వేపలమాధవరం పరిధిలో దెబ్బతిన్న మిరప పంట

మేళ్లచెరువు : తుపాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వానలకు మండలంలోని మేళ్లచెరువు, వేపలమాధవరం, రేవూరు, రామాపురం, కప్పలకుంటతండా గ్రామాల్లో సాగు చేసిన పత్తి, మిరప, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులు, వానతో పత్తి నేలరాలింది. పత్తి రంగు మారింది. పత్తి తీసేందుకు కూడా కూలీలు ఎక్కువ మంది కావాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వానాకాలం వరి కోతలు సగం మాత్రమే పూర్తయ్యాయి. దీంతో చేతికొచ్చే దశలో అనేక గ్రామాల్లో వర్షానికి పంట నేలవాలింది. పలుచోట్ల వరి పంట నూర్పిడి దశలో ఉంది. ఇక మిర్చి పంట కాయ బరువుతో చెట్టు పడిపోవడంతో పాటు నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉంది. తేమతో ఉన్న కాయకు నల్లమచ్చ ఆశించే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేసిన పంటలు అకాల వానలకు దెబ్బతినడంతో ఆర్థికంగా నష్టపోయామని తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

మంత్రిగా ఉత్తమ్ ఎంపిక హర్షణీయం


మోతెలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు


నేరేడుచర్లలో బాణసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

మోతె : కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా కుడు కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపిక కావడం హర్షణీయమని, కాంగ్రెస్ మండల పార్టీ తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. గురువారం మోతె మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి స్వీట్లు, మిఠాయిలు పంచిపెట్టి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే 6 గ్యారంటీలపై సంతకం చేసి తమ సత్తా చాటిందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నేరేడుచర్ల : తెలంగాణ రాష్ట్ర నూతన మంత్రిగా కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టడం పట్ల గురువారం నేరేడుచర్లలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలి వద్ద బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజారంజక పాలన

భానుపురి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజారంజక పాలన కొనసాగిస్తుందని మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొండగడుపుల సూరయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు సామాజిక న్యాయం అందుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో రేవంత్‌రెడ్డి కీలకపాత్ర పోషించాడని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదాకా నెత్తి పెంచకుండా గుండుతోనే ఉంటానని ప్రతిజ్ఞ చేశానని.. నేడు నా ప్రతిజ్ఞ నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

తుంగతుర్తి : గత మూడు రోజులుగా తుపాన్ కారణంగా ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు బుర్ర శ్రీనివాస్, పల్ల సుదర్శన్, ముత్తయ్య, నర్సయ్య, లింగయ్య, రాములు, వెంకన్న పాల్గొన్నారు.

జోరుగా యాసంగి సాగు పనులు


చిలుకూరులో నాటుకు సిద్ధంగా ఉన్న నారుమడి

- బోర్లు, బావుల కింద నాట్లు
- వెదజల్లే విధానంపై ఎక్కువమంది రైతుల మొగ్గు


జెర్రిపోతులగూడెంలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు


చిలుకూరులో వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి


బేతవోలులో నాటు వేస్తున్న కూలీలు

చిలుకూరు : పూర్తిగా నాగార్జునసాగర్ ఆయకట్టు మండలం అయిన చిలుకూరు మండలంలో రైతన్నలు యాసంగి పంట సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మండలంలోని చిలుకూరు, బేతవోలు, జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం, రామాపురం, నారాయణపురం, చెన్నారిగూడెం తదితర గ్రామాల్లో చెరువుల కింద, బావులు, బోర్ల కింద ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి ఎక్కువ మంది రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేపట్టేందుకు మొగ్గు చూపుతున్నారు. నాటు వేసే విధానంలో కూలీల కొరత ఉండడం, పంటకు ఎక్కువ పెట్టుబడి అవుతుండడంతో పలు గ్రామాల్లో రైతులు నేరుగా వడ్లు చల్లుకుంటున్నారు. కూలీలు నాట్లు వేయాలంటే ఎకరానికి రూ.3500 నుంచి రూ.4 వేల వరకు ఖర్చు అవుతోంది. దీంతో రైతులు విభిన్న పద్ధతుల్లో నాటు వేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.